
క్లుప్తంగా

వేడుకగా శ్రీరామ నవమి ఉత్సవాలు


అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: శ్రీరామ ఉత్సవాలను మండలంలోని పాతపాడు గ్రామంలో మూడో రోజు మంగళవారం వేడుకగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సీతారామ చంద్రుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. స్వామివారి వసంతోత్సవం యువకుల కోలాహలం మధ్య ఉత్సాహంగా సాగింది. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. నవమి మహోత్సవాల సందర్భంగా నెల్లూరు మీరావళి కళా బృందం ప్రదర్శించిన చెంచులక్ష్మి పౌరాణిక నాటకం ఆహూతులను అలరించింది.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి సూచించారు. 2025–26వ సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైనవారు ఈ నెల 14 నుంచి మే 13వ తేదీలోగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నవారు రుణాలు పొందేందుకు అర్హులని స్పష్టం చేశారు.

పాల్ ల్యాబ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ అధికారులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కేజీబీవీలో పాల్ ల్యాబ్ నిర్వహణపై పాఠశాల విద్యార్థులకు మంగళవారం జిల్లా సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, జి.రత్నం అవగాహన కల్పించారు. ముందుగా పాల్ ల్యాబ్ నిర్వహించే ప్రత్యేక గదిని పరిశీలించారు. పాల్ ల్యాబ్‌ను ప్రత్యేక గదిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సురేఖకు సూచించారు. అనంతరం ల్యాబ్ రికార్డులు పరిశీలించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో సోమవారం రాత్రి అంబేడ్కర్ జయంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యావంతులై సమాజంలో గౌరవ మర్యాదలు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి, పౌర హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాహుల్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అందించి దేశానికి దిక్సూచిలా అంబేడ్కర్ నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నందం శేఖర్, బహుజన సైన్యం అధ్యక్షులు జనుమాల నాగయ్య, బిల్లా ఇజ్రాయేల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, కాశయ్య, నూతలపాటి రాజు, అబ్రహాం, రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీపై అప్రమత్తంగా ఉండాలి


గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ

మార్కాపురం: గ్యాస్ లీకేజీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఫైర్ ఆఫీసర్ ఆర్.రామకృష్ణ తెలిపారు. అగ్నిమాపక అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మహిళలకు గ్యాస్ వాడకం, గ్యాస్ లీకేజీ అగ్నిప్రమాదాలు, నివారణ మార్గాలను ప్రయోగాత్మకంగా చూపారు. వంట చేసే సమయంలో అజాగ్రత్తగా ఉంటే గ్యాస్ లీకై సిలిండర్ పేలే ప్రమాదం ఉందని చెప్పారు. వంట గదిలో గ్యాస్ వాసన వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని, దాంతోపాటు తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ఆ సమయంలో విద్యుత్ బల్బులు వెలిగించవద్దని చెప్పారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అగ్నిప్రమాదాలు జరిగే తీరు, వాటి నివారణపై పాంప్లేట్లు పంపిణీ చేశారు.


చినమనగుండం సమీపంలో పరిస్థితి ఇదీ..


గొట్లగట్టు పెట్రోలు బంకు వద్ద ఇలా..

అతుకుల బొంత.. అడుగుకో గుంత

- వాహనదారులకు చుక్కలు చూపిస్తున్న కర్నూలు రోడ్డు
- ప్యాచ్‌ల పక్కనే మళ్లీ ఏర్పడిన గుంతలు
- పట్టీపట్టనట్లుగా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు

పొదిలి:

సంక్రాంతి పండగ ముగిసి 3 నెలలైంది.. శివరాత్రి అయిపోయింది.. ఉగాది కూడా వెళ్లిపోయింది.. శ్రీరామ నవమి ఈ మధ్యే ముగిసింది.. వరుసగా పండగలు ఒకదాని వెంట మరొకటి వచ్చిపోతున్నాయి.. క్యాలెండర్లో తేదీలు మారిపోతున్నాయి కానీ రోడ్ల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు కానరావడం లేదు. సంక్రాంతి నాటికి అద్దంలా మెరిసే రోడ్లను తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికిన పాలకులు.. కాలం గడుస్తున్నా కిమ్మనడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఒంగోలు–కర్నూలు రాష్ట్రీయ రహదారి ప్రయాణికులు, సరుకుల రవాణాలో ఎంతో కీలకమైనది. జిల్లాలోనే పొడవైన ఈ రాష్ట్రీయ రహదారి పాలకుల నిర్లక్ష్యం మూలంగా వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. చినారికట్ల జంక్షన్ మొదలుకొని చినమనగుండం వరకు రోడ్డుపై గుంతలకు కొంత కాలం క్రితం ప్యాచ్ వర్క్ చేయగా.. నాణ్యత లేమి కారణంగా దెబ్బతింది. దీంతోపాటు ప్యాచ్ వర్క్ చేసిన ప్రదేశానికి పక్కనే గుంతలు ఏర్పడ్డాయి. చినమనగుండం మొదలుకుని గొట్లగట్టు, పాతపాడు, మిట్టలు, బచ్చలకూరపాడు, జంక్షన్ సమీపం వరకు రోడ్డు పలు చోట్ల అధ్వానంగా మారింది. కంభాలపాడు పాఠశాల సమీపంలో రోడ్డుపై నాలుగు అంగుళాల మేర ఏర్పడిన గుంత అత్యంత ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు గమనించకుండా వెళ్తే ప్రమాదంబారిన పడటంఖాయం. రహదారి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన చోట నూతనంగా రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


కంభాలపాడు పాఠశాల సమీపంలో ఏర్పడిన గొయ్యి


బచ్చలకూరపాడు బస్టాండ్ సమీపంలో..


పొదిలి : వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు

ఆలయాల మార్గం అధ్వానం

పొదిలి పట్టణంలోని రెండు ఆలయాలకు రాకపోకలు సాగించే రోడ్లు అధ్వానంగా మారాయి. సైడు కాలువలు పూడిపోవడంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. పాతూరులోని శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయం, విశ్వనాథపురంలోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు మురుగులో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులపై మురుగు చింది పడుతుండటం, మురుగునీటిని తొక్కుతూ ఆలయానికి వెళ్లాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పొదిలి : ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై సైదుబాబు

- సీఐ సుబ్బారావు హెచ్చరిక

మార్కాపురం: మైనర్లకు వాహనాలిచ్చినా, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడిపినా ఆయా వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. పలువురు మైనర్లు, లైసెన్స్ లేనివారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయన్నారు. హెల్మెట్ పెట్టుకోకుండా ఇష్టారీతిగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి ఎంతో మంది మృతి చెందుతున్నారని, కొందరు క్షతగాత్రులవుతున్నారన్నారు. ప్రమాదాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే భారీ మొత్తంలో జరిమానా విధిస్తామన్నారు. ఇకపై మార్కాపురం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు తరచూ చేస్తామని పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈవో–2 గిరిధర్‌శర్మ


మాట్లాడుతున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

రాచర్ల: బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో–2 వారణాసి గిరిధర్‌శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్లో భాగంగా బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పేందుకు తగిన ప్రణాళిక రూపొందించడంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్, ట్రాన్సిషన్, జీరో డ్రాపౌట్‌ను నిర్దేశించుకుని బాల కార్మికులు లేని మండలంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి, ఎంఈవో–1 కోటేశ్వరరావు, ఇన్‌చార్జి సీడీపీవో జ్యోతి, యూఆర్టీ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓ–1 కావడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు తమ పాఠశాల పరిధిలోని ప్రాంతాలలో సర్వే చేపట్టి బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారులను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 19వ తేదీ కల్లా ఎస్ఏ–2 పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బొర్రా వెంకటరత్నం, సీఆర్పీలు పుల్లయ్య, ఆంజనేయులు, రామాంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


రాయవరంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలదేవి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు


కొనకనమిట్లలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

మార్కాపురం టౌన్: గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు, మునగాకు, ఆకుకూరలతో సంపూర్ణ పోషకాహారం లభిస్తుందని సీడీపీఓ సుశీలదేవి పేర్కొన్నారు. మంగళవారం రాయవరంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లకు వంటల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలని, పిల్లలకు కూడా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.భాగ్యమ్మ, సూపర్‌వైజర్లు లలిత సలోమీ, అరుణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

బేస్తవారిపేట: పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. మంగళవారం స్థానిక సచివాలయం–2లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు పౌష్టికాహారం తయారీపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జంక్ ఫుడ్ తినడం వల్ల చిన్నపిల్లల్లో ఊబకాయం ఏర్పడుతుందని, ఆకుకూరలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తింటే ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటుపడేలా అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లలు సెల్‌ఫోన్‌కు అలవాటుపడకుండా చూసుకోవాలన్నారు. వంటల పోటీల్లో గెలుపొందిన అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్తకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య, ఎంఈఓ కాశయ్య, సీడీపీఓ నీలోఫర్‌బేగం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆదర్శంగా ఉండాలి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాలని ఎంఈఓ–2 నరసింహారావు పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందజేసి కేంద్రాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుధా మారుతి పర్యవేక్షణలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొనకనమిట్లలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహార ఉపయోగాలపై సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంపై కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. ఈఓపీఆర్డీ శ్రీదేవి, సూపర్‌వైజర్లు సరిత, ప్రసన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు యంబాడి ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి గలిజేరుగుళ్లలో ఆధార్ సేవలు

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల గ్రామ సచివాలయంలో బుధవారం నుంచి 19వ తేదీ వరకు ఆధార్ నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. నూతన ఆధార్ నమోదు, అప్‌డేషన్, సెల్ నంబర్ లింక్ చేయడం, చేర్పులు–మార్పులు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

నీటి సరఫరాపై విజిలెన్స్ తనిఖీ

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో 2019–2024 మధ్య ట్యాంకర్లతో నీటి సరఫరాపై విజిలెన్స్ అధికారులు మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ట్యాంకర్లతో నీరు చేసిన ప్రాంతాల వివరాలు, వాటి బిల్లుల పుస్తకాలు, రిజిస్టర్లను పరిశీలించారు. నీటి సరఫరాలో అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

‘ఉపాధి’ పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు


ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

కొనకనమిట్ల: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలతో సక్రమంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలపై ‘ఉపాధి మాయ’ శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు, బోగస్ మస్టర్‌పై ఆరా తీశారు. గోకులం షెడ్లకు సంబంధించి పూర్తి బిల్లులు మంజూరు కాలేదని చెప్పారు. స్థానికంగా నివాసం ఉండని వారి పేర్లు మస్టర్లలో నమోదు చేస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. పని ప్రదేశాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఫారం పాండ్స్(రైత్వారీ కుంటలు) పనులును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఏపీడీ రావూరి లలితకుమారి, ఏపీఓ బుల్లెన్నరావ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

దేవుడే ఇచ్చాడు.. వీధి ఒకటి..!


బేస్తవారిపేట బస్టాండ్ సమీపంలోని వీధిరోడ్డులో

బేస్తవారిపేట: మద్యం మహమ్మారి కుటుంబాలను అతలాకుతలం చేస్తోంది. పేద, బడుగు, బలహీన వర్గాల వారు సంపాదన మొత్తం మద్యానికి తగలెట్టేస్తున్నారు. వేళాపాల లేకుండా విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తుండటమే అందుకు కారణం. గతంలో రూ.200కు ఒక క్వార్టర్ తాగితే ఇంటికి వెళ్లేవారు. నేడు అదే నగదుకు రెండు క్వార్టర్లు వస్తుండటంతో తాగి మత్తులో ఎక్కడపడితే అక్కడ పడి దొర్లుతున్నారు. ఎవరో ఒకరు జాలి తలిచి మంచినీరు తాగించి రోడ్డుకు పక్కగా పడుకోబెడితే బతికిపోతున్నారు.


బేస్తవారిపేట ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మురుగుకూపంలో


బేస్తవారిపేట పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై


జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై